# 80. పరోపకార చక్రవర్తి

దామోదర చక్రవర్తి - అదీ, అతని పేరు. బెంగాలీ వాడేమో తెలీదుగాని, తెలుగు భాషని తెలుగువాడిలాగే మాట్లాడతాడు. కలకత్తాలో హెడ్డాఫీసు ఉన్న ఒక షిప్పింగ్, క్లియరింగ్ అండ్ ఫర్వార్డింగ్ ఏజెన్సీ తాలూకు విశాఖపట్నం ఆఫీసులో అసిస్టెంటు మేనేజరుగా పనిచేస్తాడు. నెలకి ఏడురోజులు ఊళ్లో వుంటాడు. మిగతా రోజులన్నీ కలకత్తా, బొంబాయి, మెడ్రాసు, ఢిల్లీ నగరాల్లోనూ రైళ్లలోనూ వుంటాడు. గొప్ప వుపకారస్తుడు. అతను ఫలానా వూరికి కేంపు వెళుతున్నాడని తెలిసిన వాళ్లు ఆ వూళ్లో చవగ్గా దొరికే ఫలానా సరుకు తెమ్మని పురమాయించాలే గాని డబ్బులు కూడా పెట్టుబడి పెట్టి తెస్తాడు.

కిందటేడు జనవరి 18నాడు విశాఖపట్నం బెంగాలీ సంఘం వాళ్లు కె.ఎల్. సైగల్ వర్ధంతి సభ పెట్టినప్పుడు పరిచయమయ్యాడు చక్రవర్తి. అప్పట్నించీ ఎప్పుడు కనబడినా "రేపు బయల్దేరి ఢిల్లీ వెళ్లున్నాను. ఏమైనా తేవాలంటే చెప్పండి." లాంటి ఆఫర్లు చేస్తూనే ఉన్నాడు. చివరికి మొన్న దసరాకి ముందర కలకత్తా వెళ్తూ అతను ఎనౌన్సుమెంటు చేస్తే చక్రవర్తి చేత సేవ చేయించుకోవాలన్న ప్రలోభంలో పడ్డాను. "ఓ అరడజను బనీన్లు తెచ్చిపెట్టండి" అని డబ్బిచ్చాను. "ఎనిమిదో తారీఖు ఉదయం మా ఇంటికి రండి" అన్నాడు.

వెళ్లేను. "బాత్‌రూంలో ఉన్నారు. కూర్చోండి" అని "చక్రవర్తిని"గారు నన్ను హాల్లో కూర్చో బెట్టారు.

అక్కడున్న పొడుగాటి బెంచీమీద వరాసగా సామాన్లు పేర్చి ఉన్నాయి. ఒక్కొక్క ఐటమ్ కింద ఒక్కొక్క స్లిప్పు; దాని మీద ఆ సరుకు పురమాయించిన వ్యక్తి పేరు, డబ్బు ఎకవుంటు - పద్ధతిగా వున్నాయి. చక్రవర్తి చేస్తున్న సంఘసేవకి ముగ్ధుణ్ణాయి; ఈ మాటు నేను నూజివీడు వెళ్లినప్పుడు ఇతనికి ఓ పాతిక "పెద్దరసాలు" తెచ్చివ్వాలని నిర్ణయించుకున్నాను.

"ఇది మీ బనీన్ల పేకెట్టు; తీసికెళ్లండి. మీరు నూట ఏభై రూపాయలిచ్చేరు. ఇంకో ఆరు రూపాయలివ్వండి.... థాంక్స్. అదుగో, ఆ పాకెట్టు : మీ వీధిలోనే ఉన్నారు, నారాయణ మూర్తి గారు; ఆడిటరు; వారికి ఇచ్చెయ్యండి. ఆయన రెండు వేలిచ్చారు. నూట ఇరవై రూపాయలు మిగిలేయి. ఇదుగో... అబ్బే, తొందరలేదు. సాయంకాలం ఇవ్వచ్చు." అని భావగర్భితంగా నవ్వి చెప్పేడు చక్రవర్తి.

పేకెట్స్ స్కూటర్ మీద పెట్టుకుని ఆఫీసుకి వెళ్లేను. సాయంకాలం దాకా టైముంది కదా అని.

మధ్యాహ్నం మూడు గంటలకి మా ఆఫీసువాళ్లు, నన్ను, మా లీగల్ అడ్వయిజర్ గారింటికి వెళ్లి ఓ కాగితాన్ని "వెట్" చేయించుకు రమ్మంటే పాకెట్టు బీరువాలో భద్రపరిచి నా అసిస్టెంటు గంగరాజుతో కలిసి వెళ్ళేను.

మా లీగల్ ఎడ్వయిజరు గారు పెద్దాయన. కొడుకు ఆయన దగ్గిరే జూనియరూ పార్ట్నరూ. కొంతసేపు మా కేసు స్టడీ చేసాక కుర్రాయన గుమ్మంలో కెళ్ళొచ్చేడు. "నాన్నారూ; ఐదువందలు కావాలి" అని డ్రాయర్ సొరుగులోంచి తాళాలు తీసుకుని కేష్ పెట్టె తెరిచి

"అయ్యో, ఇందులో నాలుగు వందలే ఉన్నాయే!" అన్నాడు. "ఆ వందా నేను దాఖలు చేసుకుందునా?" అనడానికి నేను కరటక శాస్త్రినీ కాదు; నేను పట్టుకెళ్లింది నా స్వంత కేసూ కాదు.

పెద్దాయన గభాల్న లేచి "పద, నేను మాట్లాడతాను." అని గుమ్మంలోకి వెళ్లేడు, కొడుకుతో "ఓహో; ఇదా నువ్వు చేస్తున్న నిర్వాకం? పట్టుమని పదివాక్యాలు కోర్టులో కాదు కొంపలోనే మాట్లాడలేవుగాని, నీ సిగరెట్లకి 500 రూపాయలా? బుద్ధి లేకపోతే సరి. మానీమంటే నువ్వు ఎలాగా మానవు. రోజుకి ఒక పెట్టి కాలుస్తూనే ఉంటావు. ఇప్పుడు కలకత్తాలో ఫేక్టరీ రేటుకి దొరికేయి కదా అని ఒక్కసారే ఎనభై పేకెట్లు తెప్పించుకుని - ఇంక అవన్నీ అయిపోయేదాకా దీక్షగా కాలుస్తూ కూచుంటావు కాబోలు... అయినా నువ్వేమన్న పెద్దమనిషివయ్యా! ఏమిటీ నీ పేరు; చౌదరా, చక్రవర్తా అన్నావు! కలకత్తా వెళ్లేవు; బావుంది. ఫ్రెండు కదా, ఏదైనా తెచ్చివ్వాలనిపించింది; మంచిదే. కానీ, ఏ రసగుల్లాలో, దూద్ పేడాలో నలుగురికీ పనికొచ్చేవి తేవాలిగాని సిగరెట్లుటయ్యా, తేవడం? నీకేమైనా మతీ సుతీ ఉన్నాదా అని! పట్టుకెళ్ళి ఏ రిటేల్ షాపులోనో అమ్మేసుకో, పో!"

ఆఫీసు కొచ్చేక బీరువాలోంచి నారాయణ మూర్తి గారి కివ్వవలసిన పాకెట్ తీశాను. "ఉదయం నుండి చూస్తున్నాను. ఆ పేకెట్ ఏటి గురూ గారూ?" అన్నాడు గంగరాజు.

చెప్పేను. గంగరాజు ఆ పేకెట్‌ని ఎత్తి పట్టుకుని ఆడించేడు. "ఇందులేటుందో తెలిసే పుచ్చుకున్నారా?" అన్నాడు. "తెలీదే" అన్నాను. ఇవి విస్కీ బాటిల్సండి. కలకత్తాలో స్కాచ్ విస్కీ సవకండి. అందుకని నారాయణ మూర్తిగారు చెక్కరవర్తికి చెప్పి తెప్పించుకుంటారండి" అన్నాడు. "మీరు గాని ఈ పేకెట్ పట్టుకెల్తప్పుడికి ఆయనగారు లేరనుకోండి; అప్పుడేటవుద్దో ఆలోసించి మరీ పట్టుకెల్లండి."

"ఏమిటవుతుంది? నారాయణ మూర్తిగారి మిసెస్ ఉంటారు. ఆవిడకి ఇచ్చేస్తాను!"

"ఆఁ, అక్కడే పప్పులో కాలేస్సేరు. ఆవిడ సంగతి మీకు తెలీదు. ఓసారి ఏటైందనుకున్నారు? అప్పుడికింకా నారాయణ మూర్తిగారు ఇంట్లో లిక్కరు కేబినెట్ ఓపన్ చై లేదులెండి. ఆయనానూ, క్రిష్ణంరాజు గారూనూ; బార్లో మందు పుచ్చుకున్నారండి. నారాయణ మూర్తిగారు అవుటయిపోతే క్రిష్టంరాజుగారు ఆయిన్ని నాకప్పజెప్పి ఎలిపోయేరండి. ఆయిన్ని ఇంటికి తీస్కెల్లి ఆవిడిగారికి హేండోవరు జేస్తే - ఆవిడగారు మొగుణ్ణలా గొదిలేసి నన్ను తిట్లకి లంకించుకుందండి. అడ్డమైన లం- కొడుకులూ ఈన్ని పీకలమొయ్యా తాగించేసి అద్దరాత్రి తీసుకొచ్చి నా పక్కలో కెక్కించేస్తారంటూ హేతువాదం బూతువాదం మిక్సింగ్ చేసేసి నామీద "సమరం" ప్రకటించిందండి. అంచేత ఇవేళ మీరు గానీ ఈ బాటిల్సు ఆవిడికి హాండోవర్ జేస్తే ఆవిడగారి తిట్లతో రేపంతా మీకు హాంగోవరు గేరంటీయండి" అని ఏడుపూ నవ్వూ మిక్సింగు చేసి చెప్పేడు గంగరాజు.

చక్రవర్తి పరోపకార బుద్ధివల్ల నాకెంత అవస్తొచ్చి పడ్డాదని ఇదయ్యేను.

"అంచేత, గురూగారూ; నారాయణ మూర్తిగారి ఆఫీసుకి ఫోన్ జేసి ఆయన్నే ఇక్కడికి కార్లోవొచ్చి ఈ పేకెట్ పట్కెల్లమనండి. ఆయన రాత్రి ఏడు గంటల్దాకా రాలేడు గనక మీరిక్కడే ఈ పేకెట్టుకి కాపలా కూకోండి. నేనొస్తాను." అని ఉచిత సలహా పారేసి గంగరాజు వెళ్లిపోయాడు.

★